# చెంచుదంపతులు

౧

నల్లమల కొండలలో సంతతము ప్రవహించే సెలయే
టికి సమీపంలో వున్న చెంచుగూడెములో లింగడు
కాపురము చేస్తున్నాడు.

లింగడు ఇంతవరకూ తల్లిదండ్రులవద్దనే నివసించే
వాడు. పెండ్లి చేసుకొని కొన్ని నెలలే అయింది. తాను
భార్యా వేరుగా ఇల్లొకటి యేర్పాటుచేసుకొని కాపు
రము చేస్తున్నారు.

భగవంతుడు పెంచిన దట్టమయిన చెట్లకింద నిర్మిం
పబడ్డది వీరిగూడెము. ఒకచెట్టుకింద వలయాకారముగా
వెదురుబద్దలతో చిన్నగుడిసెలు సొంతముగా కట్టుకొని
అందులో ఈదంపతులు కాలక్షేపము చేస్తున్నారు.
వర్షాకాలమందే ఆయింట్లో పండుకోడం. తమవస్తువులు
ఉంచుకోడానికీ వంటచేసుకోడానికీ ఆయిల్లు సాధారణ
ముగా పనికివస్తున్నది.

లింగడిభార్యాపేరు ఈరమ్మ. వీరిప్రేమగాథ నాగర
కుల ప్రేమగాథలవంటిదే. వారిహృదయానుభవాలే వీ
రివిని. చిన్నతనమున చెట్ల నల్లుకొన్నతీగలను ఉయ్యా

లలుగా చేసుకొని వారు ఊగులాడేవారు. ప్రాతఃకాలములందు ఇరువురూ కలిసి కొండల్లో తిరుగాడుతూ, పక్షుల వేటాడుతూ వేటాడినజంతువులను ఆరగిస్తూ సాయంకాలానికి ఇంటికి తిరిగివచ్చేవారు. ఇరువురూ ఒక్కబడిలోనే చదువుకున్నారు కూడా. చదువులయ్యబడికి పోయినప్పుడల్లా యిచ్చేపప్పులను వాళ్ళిద్దరూ చెట్టుకింద కూచుని తినేవారు. బడికి పోయేవారికి దొరతనమువారు ఇచ్చేబట్టలను వారు కట్టుకొని బడికి పోవుట మాని తిండికై వేటాడబోయేవారు. బడి విడిచేటప్పటికి వారి కలవడినవిద్య అక్షరములు గుర్తించడమే. ఈ అక్షరము లనేగీతలను అయ్యవారు ఏల నేర్పుతున్నాడో వారికి బోధపడలేదు. హిందూదేశములో పలుజాతులకువలెనే వీరికి ప్రకృతము కావలసింది విద్య కాదు, తిండి! విజ్ఞానము కాదు, కట్టుబట్ట.

ఈరమ్మకు యౌవనము పొడచూపింది. లింగడకి హృదయము పరిభ్రమించింది.

ఒకనా డిరువురూ కలిసి తేనెపెరలు తాగడానికి కొండఅంచులకు పోయినారు. లింగడు కొండ యెక్కినాడు. ఏటవాలుగావున్న కొండకింద ఈరమ్మ నిలబడి చూస్తున్నది. లింగడు ఒకబండచివరకు వచ్చి బండకిందితట్టు లోభాగమున వున్న తెట్టెను వెనుకకర్రతో

పాడిచినాడు. ఈగలు జుమ్మని ఒక్కమారు లేచినవి. తెట్టె కింద పడలేదు. లింగడు ఈగలబాధకు తాళలేక కిందకు వచ్చినాడు. ఈరమ్మ మొగము చిట్లించుకున్నది.

కడచినదినము తిన్న ఆహారమే గాని వారి కాపొద్దు తిండి లేదు. ఉభయులకూ బాగా ఆకలివేస్తున్నది. తేనె తాగి మైనము తినవచ్చు ననుకున్నారు గాని సాధ్యపడలేదు. లింగడిమనస్సు చివుక్కు మన్నది. ఈరమ్మ కొండకింద పొగబెట్టడానికి ప్రయత్నముచేస్తున్నది, అట్టిపని అడవికి ప్రమాదమని ఆమెకు తెలియదు. లింగడికి తెలుసును. ఒకమారు "కరిగాడు" అలుగు విడిచినాడు. అది అడవిలో ఎక్కడనో పడిపోయి కానవచ్చింది కాదు. నాగా అడవిని కాల్చివేసి అలుగును సంపాదించినాడు. దొరతనమువారందుకు వాణ్ణి శిక్షించినారు.

పొగ పెట్టవద్దని ఈరమ్మతో లింగడు చెప్పి మళ్ళీ కొండ ఎక్కినాడు. ఈరమ్మకూడా వానివెంట వెళ్ళింది. ఇద్దరూ బండచివరకు వెళ్ళినారు. లింగడు బండమీద సాగిలబడి ముందుకు జరుగుతూ పోయినాడు. ఈరమ్మ అతనిచేతి నొకదానిని గట్టిగా పట్టుకున్నది. లింగడు బండచివరకు పోయి దేహమును వంచి రెండవచేతితో తేనె తెట్టును బట్టి ఊపి పెరికినాడు. ఈరమ్మ లింగడిని

వెనుకకు లాగినది. ఇద్దరును ఒకరి నొకరు చూచుకొని నవ్వుకొన్నారు. తేనెతట్టు దొరకినది. కాని ఇద్దరి దేహములూ ఈగకాటులవల్ల గాయము లైనవి. ఆకుపసరు ఒంటికి పూసుకొని తేనె తట్టు పట్టుకొని వారొక మడుగు దగ్గిరకు పోయినారు. ఒక చెట్టుకింద కూర్చున్నారు. చీకటి పడినది. చంద్రుడుదయించినాడు. పొదలు పొదలుగా వెన్నెల అడవి అంతటా పడినది. తాండ్రపువ్వులు అడవిని సువాసనలతో నింపుతున్నవి. పక్షులు చెట్లమీద కిల కిల లాడుతూ గోల చేస్తూవున్నవి. ఇద్దరూ ఆ చెట్టుకింద ఆ తేనెపెరను తింటూన్నారు. ఈరమ్మ ముక్కలు చేస్తూ ఒక్కొక్క ముక్కను లింగనినోటి కందించుచున్నది. లింగడు ఈరమ్మ దేహమును నొప్పి పోవుటకై నిమురుతున్నాడు. తిని కడుపు నిండా నీరు తాగినారు. ప్రపంచ మిప్పుడు వారికి సుఖమయమయి తోచింది. లింగడు ఈరమ్మ గాయములకు చల్లనినీరు రాస్తున్నాడు. ఈరమ్మ లింగని దేహమును చల్లటి నీళ్లతో కడిగింది.

ఆ చెట్టుకింద ఆమడుగు గట్టున ఆ వెన్నెల వీలికల మధ్య ఆయిరువురూ ఒండొరుల కౌగిట జిక్కి ఒక్క ముద్దు పెట్టుకున్నారు. అడవిలో సువాసన అధిక మయింది.

విహంగగుత్తముల మనోహారత్వ మతిశయించింది. చంద్రిక మిక్కిలి ప్రకాశవంతమయింది.

## ౨

వాళ్ళు ప్రతిదినమూ అడవులలో తిరిగి దొరికిన చిన్నజంతువులను తేనె తట్టులను, చెంచుగడ్డలను తినే వారు. కొత్త దినాలలో ముచ్చట యిది. ఆరోజుల్లో ఒక్కొక్కప్పుడు తిండి దొరకక పోయినప్పటికీ వారు లెక్క చేసేవారు కారు. క్రమ క్రమంగా తక్కిన చెంచులువలెనే వారూ కష్టపడి కూలి సంపాదంచుకొన వలసి వచ్చింది. లింగడు వెదురు కొట్టుతూ బద్దలకింద వాటిని చీల్చుతూ యిట్టిపనులను చేస్తూ రోజు కారణాలవంతున సంపాదిస్తూవున్నాడు. ఈపని వీరికి దొరతనము వారు ఏర్పాటుచేసి తమ వుద్యోగస్థులచేత రోజుకూలి యిప్పిస్తారు.

ఈరమ్మ అడవులలో తిరిగి తిరిగి దొరికినంత తేగలిగినంత చింతపండు, కుంకుడుకాయలు, శీకాయ, చారపప్పు మున్నగు వస్తువులు తెచ్చి దొరతనము వారు ఏర్పాటు చేసిన వుద్యోగస్థులకు తూనిక ప్రకారం అమ్మి కొన్నిఅణాలు సంపాదించుకొంటున్నది.

గడించిన ఈధనమును వారు పట్టణాలకు తీసుకు పోయి బియ్యము ఉప్పు మున్నగు వంటవస్తువులు బట్టలు, పిల్లల కిమ్మలూ, కొనేవాళ్ళు.

గౌనరుమెంటువారు ఈయేర్పాటు చెయ్యకముందు చెంచులు ఈవస్తువులను పట్టణాలలో కోమట్లకు అమ్ముతూ వుండేవారు. కోమట్లు మిక్కిలి చౌకగా కొని ధనవంతులు అయ్యేవారు. ఇప్పుడు దొరతనమువారు చెంచులను బాగుపరిచే ఉద్దేశ్యముతో ఆవ్యాపారం తామే జరిగిస్తున్నారు. ఆనాటి చెంచులస్థితికీ ఈనాటి స్థితికీ భేదం లేదు. ఎప్పుడూ వారు తిండికి బట్టకూ లేక కష్టపడుతూ వుండవలసిందే.

పుష్కలంగా తిండి దొరికెగలఅడవులకు పిల్లలై జంతువులు, చెంచువాళ్ళు, ఇతరఅడవిమనుష్యులు జనించారు. జంతువులకు కడుపునిండా తిండి కద్దు. ఆఅడవికడుపున బుట్టినమానవులకు తిండిలేదు. వారితల్లికా యీ పక్షపాతము? తోడిమానవుల దౌర్జన్యమా యిది!

దంపతులిద్దరూ వసంతకాలాన మామిడిచెట్లను ఆశ్రయించి ఆచెట్టిచ్చే కాయలతోనూ పండ్లతోనూ పొట్ట నింపుకొనేవారు.

చెంచువాండ్లకు ఆవులు బర్రెగొడ్లూ విశేషంగా వుంటవి. అవేవారిఆస్తి. లింగడికీ భార్యకూ మొత్తం పదిఆవు లున్నవి.